క్లుప్తంగా

పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజలు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక సమీప సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఈ నెల 11 నుంచి ఘనంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో కమిటీ నిర్వాహకులు సామూహిక కుంకుమ పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సంజయ్‌గాంధీ కాలనీతో పాటు సింహగిరి కాలనీ, పెదగదిలి, హనుమంతవాక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రాలతో సాముహిక కుంకుమ పూజలు చేయించారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, పలు పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీతారాములకు వెండి కిరీటాల బహూకరణ


వెండి కిరీటాలతో సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ సంజీవినగర్ కాలనీలోని హనుమత్ సీతారామలక్ష్మణ ఆలయానికి నగరానికి చెందిన అనిల్‌కుమార్‌రాజు వెండి కిరీటాలు బహూకరించారు. వాటిని శనివారం ఆలయంలో కమిటీ నిర్వాహకులకు అప్పగించి దేవతా మూర్తులకు అలంకరించారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బీవీకే స్కూల్ పూర్వ విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ స్కూల్‌లో 1993 నుంచి 2017 వరకు చదువుకున్న సుమారు 60 మంది వరకు విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా 10 మంది పూర్వ గురువులను గౌరవప్రదంగా సత్కరించారు. కార్యక్రమంలో బీవీకే కార్యదర్శి రామ సత్యనారాయణ, సమితి శిక్షణిక్ ప్రమోద్ బి.నారాయణరావు, కరెస్పాండెంట్ ఆర్.నర్సింగరావు నాయుడు, ప్రధానోపాధ్యాయురాలు కె.వి.డి.మాధురి పాల్గొన్నారు.


తీరంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


బీచ్‌లో కూలిన ఇనుప విద్యుత్ స్తంభం

ఏయూక్యాంపస్: సాగర తీరంలో ఇసుకలో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ దీప స్తంభం కూలిపోయింది. గతంలో ఏర్పడిన తీర ప్రాంత కోత ఫలితంగా ఈ స్తంభం నేలకొరిగి ప్రమాదకరంగా మారింది. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్‌కు ఎదురుగా ఈ స్తంభం ఉంది. ఇసుక కోత ఫలితంగా కూలిన ఈ స్తంభాన్ని నేటికీ తొలగించలేదు. దీనికి అమర్చిన ఎల్‌ఈడీ దీపాలు సైతం తొలగించలేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరవాసులు, పర్యాటకులు తీరంలోని ఇసుకపై నడవడానికి ఇష్టపడతారు. అటువంటి సమయంలో ఆదమరిస్తే గాయాల పాలవడం ఖాయం. సంబంధిత అధికారులు కూలిన స్తంభాన్ని తొలగించాలని సందర్శకులు కోరుతున్నారు.

కనువిందు చేసేలా.. వన్య ప్రపంచం

ఇందిరాగాంధీ జూ పార్కు నూతన హంగులను సంతరించుకుంటోంది. పలు అభివృద్ధి పనులతో ఇక్కడ కొత్తదనం తీసుకురావడానికి జూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తగా ఎన్‌క్లోజర్లు నిర్మించడం, ఉన్న వాటిని ఆధునికీకరించడం, మరికొన్ని పునర్నిర్మించడం వంటివి చేస్తున్నారు. వాటిలో కొన్ని సిద్ధం కాగా.. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. పలు సంస్థలు సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా కేటాయించిన నిధులతో కొన్ని, జూ నిధులతో మరికొన్ని నిర్మాణాలు చేపడుతున్నారు.
- ఆరిలోవ




జూలో నిర్మించిన డక్ ఏవియరీ

కొత్తగా డక్ ఏవియరీ

లవ్ బర్డ్స్ జోన్ పక్కనే ఇంతవరకు జూలో లేని డక్ ఏవియరీని నిర్మించారు. దీంతో కొత్త పక్షులకు సంబంధించిన ఎన్‌క్లోజర్ నిర్మాణం ఇక్కడ అదనంగా అందుబాటులోకి వచ్చింది. బయట జూ పార్కుల నుంచి వివిధ రకాల బాతులను తీసుకొచ్చి ఇందులో విడిచిపెట్టనున్నారు. సందర్శకులకు కనువిందు చేసేలా బాతుల కోసం ప్రత్యేకంగా ఐదడుగుల లోతులో నీటి కొలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దీనిపైన టాప్ వేయాల్సి ఉంది. కొద్ది రోజుల్లో వివిధ రకాల బాతులు సందర్శకులను అలరించనున్నాయి.


బర్డ్స్ ఏవియరీ(గెద్దలు) కోసం చదును చేసిన స్థలం

జూ పార్కులో జోరుగా అభివృద్ధి పనులు

సందర్శకులను ఆకర్షించేలా డక్, బర్డ్స్ ఏవియరీల నిర్మాణం

హిమాలయన్ బేర్, లవ్ బర్డ్స్ జోన్ల ఆధునికీకరణ

పలు సంస్థలు, జూ నిధులతో పనులు

ఇటీవల చేపట్టిన నిర్మాణాలు


జూ పార్కులో ఇటీవల హిమాలయన్ బ్లాక్ బేర్ ఎన్‌క్లోజర్, లవ్ బర్డ్స్ ఎన్‌క్లోజర్, డక్ ఏవియరీ, బర్డ్స్ ఏవియరీ, వైల్డ్ డాగ్ బ్రీడింగ్ సెంటర్, స్క్విరల్ మంకీస్ ఎన్‌క్లోజర్ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బర్డ్స్ ఏవియరీ నిర్మాణ పనులు వారం కిందట ప్రారంభించారు. మిగిలిన కొన్ని నిర్మాణాలు పూర్తవగా.. మరి కొన్ని పనులు పూర్తి కావాల్సి ఉంది. పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించడంతోపాటు పనులు చేపట్టాల్సిన బర్డ్స్ ఏవియరీకి శంకుస్థాపన చేయాల్సిన ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి కె.పవన్ కల్యాణ్ పర్యటన అనివార్య కారణాల వల్ల ఇటీవల రద్దయింది. దీంతో ఈ ప్రారంభోత్సవాలు వాయిదా పడ్డాయి.


సిద్ధమైన హిమాలయన్ బ్లాక్ బేర్ ఎన్‌క్లోజర్

ఆధునిక హంగులతో పునర్నిర్మాణాలు

జూలో కొన్నేళ్ల కిందట శిథిలమైన హిమాలయన్ బ్లాక్ బేర్ ఎన్‌క్లోజర్‌ను ఇటీవల పునర్నిర్మించారు. దీని నైట్‌క్రాల్‌ను ఆధునికీకరించారు. ఇక్కడ దేశంలో ఏకైక అడవి కుక్కల పునరుత్పత్తి కేంద్రాన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించారు. గతంలో ఉన్న బ్రీడింగ్ సెంటర్ ఆవరణలోనే అదనపు నిర్మాణం పూర్తి చేశారు. సన్నని ఇనుప ఊచల నిర్మాణంలో సందర్శకులకు కనీకనిపించనట్లు ఉండే లవ్ బర్డ్స్ జోన్ పునర్నిర్మించారు. ఆధునిక హంగులతో లవ్ బర్డ్స్ గూళ్లకు అద్దాలు అమర్చి సందర్శకులకు స్పష్టంగా పక్షులు కనిపించేలా తయారు చేశారు. ఈ జోన్ ఆవరణలోని ఖాళీ స్థలంలో చిన్న నీటి కొలను, చుట్టూ పచ్చని మొక్కలు ఏర్పాటు చేసి సందర్శకులకు కనువిందు చేసేలా సిద్ధం చేశారు. హుద్‌హుద్ తుపాన్ దాటికి కూలిపోయిన రాబందుల ఎన్‌క్లోజర్ స్థానంలో బర్డ్స్ ఏవరీ నిర్మిస్తున్నారు. ఈ ఎన్‌క్లోజర్‌లోని గెద్ద జాతికి చెందిన పక్షులన్నీ బయటకు ఎగిరిపోయాయి. దీని నిర్మాణం పూర్తయితే వేరే జూ పార్కుల్లోని గెద్ద జాతి పక్షులను అధికారులు ఇక్కడికి తీసుకురానున్నారు. వీటిని ఈ నెల 8న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌చే ప్రారంభించడానికి జూ అధికారులు సిద్ధం చేశారు. ఆయన పర్యటన రద్దు కావడంతో ఈ ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది.


జూ పార్కులో అద్దాలతో సిద్ధం చేసిన లవ్ బర్డ్స్ జోన్


బాతుల కోసం నిర్మించిన నీటి కొలను

కరకచెట్టు పోలమాంబ జాతరకు విస్తృత ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు: ఈ నెల 15న పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు, అనుపోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో కె.గాయత్రి తెలిపారు. శనివారం దేవస్థానంలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించి, మీడియా సమావేశం నిర్వహించారు. లక్ష నుంచి లక్షా 50 వేల మంది భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, పిల్లలు, భక్తుల సౌకర్యార్థం అప్పుఘర్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పోలమాంబ దేవస్థానం వరకు లెండి విద్యా సంస్థల సహకారంతో ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. చినవాల్తేరు షిర్డీసాయి మందిరం నుంచి 18 మంది మహిళలు ఆ రోజు ఉదయం 4.30 గంటలకు హారతులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పోలమాంబకు సారె, చీర పెడతారని తెలిపారు. ఈ నెల 14న తొలేళ్లు, 15న అనుపు, 22న మారువారం, 26న మహా అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సోమవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి తొలి పూజ అనంతరం దర్శనాలు మొదలవుతాయని చెప్పారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు మద్దివారి పెద్దింటి నుంచి చదనం పట్టు మీదుగా 14 గ్రామాల పెద్దల సమక్షంలో అమ్మవారు దేవస్థానానికి వేంచేయిస్తారన్నారు. దేవస్థాన ఆవరణలో విచారణ కేంద్రం ఏర్పాటు చేశామని, ఏయూ మైదానంలో కార్ల పార్కింగ్‌కు అవకాశం కల్పించినట్లు వివరించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కట్లు అందిస్తామన్నారు. ఫెస్టివల్ ఆఫీసర్‌గా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ వ్యవహరిస్తున్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు బైరెడ్డి పోతన్న రెడ్డి, గౌరురెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పల దాసురెడ్డి, ఆనందరెడ్డి, దేవస్థానం అర్చకులు శ్రీనివాసచార్యులు, చక్రవర్తి, అప్పలాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈవో గాయత్రి, గ్రామ పెద్దలు

నేడు దేవతామూర్తుల ప్రతిష్టాపన

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ సమర్ధ సద్గురు సాయినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రతిష్టించనున్న శ్రీ పంచనాగ సహిత, నాగబంధ సమేత శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల యంత్ర ప్రతిష్టలో భాగంగా శనివారం పురవీధుల్లో వాటిని ఊరేగించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు దేవతా మూర్తులను తలపై మోస్తూ గ్రామ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ప్రభాకరశర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మలు దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపి ఊరేగించారు. అనంతరం దేవతా మూర్తులను శంకుచక్రంపై ఉంచి, విఘ్నేశ్వర పూజతో ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు పీల కనకరాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షుడు పీల నాగేశ్వరరావు, ఆడిటర్ కాండ్రేగుల నూకేష్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డేటి నర్సింగరావు, మద్దాల నరసింగరావు, సుంకరి నరసింహారెడ్డి, ద్రాక్షరపు నూకరాజు, బొడ్డేటి సూర్యనారాయణ, మద్దాల వీర వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆదారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వాహనంలో తీసుకెళ్తున్న విగ్రహాలు

ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలు


విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధుల బృందం


మతమా.. మానవత్వమా నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు రెండు ప్రదర్శనలు ఆసక్తికరంగా సాగాయి. అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మాలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, మిశ్రో, నెక్కంటి సీతారామచంద్రమూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు.

ఎస్.కె.మిశ్రోకు 'రంగస్థల కళాభారతి' పురస్కారం

నటుడు, నాటక రచయిత, దర్శకుడు ఎస్.కె.మిశ్రోకు రంగస్థల కళాభారతి బిరుదు పురస్కారం అందజేశారు. మిశ్రో దంపతులకు శాలువా కప్పి, పూల మాలలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. రూ.10 వేల నగదు బహుమతిని అతిథులు అందజేశారు. అనంతరం మిశ్రో మాట్లాడుతూ ఇలాంటి సత్సంప్రదాయం పాటిస్తున్న విశాఖ మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ బిరుదుతో సత్కరించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శనలు

నాటక పోటీల్లో మొదటి నాటకంగా చైతన్య కళాశాల ఉక్కునగరం వారి సమర్పణలో 'అసత్యం' ప్రదర్శించారు. రెండో నాటకంగా ప్రదర్శించిన 'మతమా.. మానవత్వమా' అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం దర్శకులకు, రచయితకి ప్రదర్శన పారితోషకం, ప్రశంసాపత్రాలను ముఖ్య అతిథులు అందజేశారు.

దళితుల అభ్యున్నతికి సహాయ సహకారాలు


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గెజిటెడ్ అధికారులు

సీతంపేట: దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ గెజిటెడ్ అధికారులు సహాయ సహకారాలు అందించాలని రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన ఉత్తరాంధ్ర ఎస్సీ గెజిటెడ్ ఆఫీసర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఎస్సీ యువకులకు ప్రభుత్వ పథకాలు, దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన లేకపోవడంతో పథకాలు చేరడం లేదన్నారు. ఎస్సీ అధికారులు సెలవు రోజుల్లో గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మరో వక్త సూపరింటెండెంట్ ఇంజినీర్ విజయానందు మాట్లాడుతూ నిన్నటి వరకు ఆగిపోయిన పథకాల అమలుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషకరమన్నారు. నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళిత సంఘాల నాయకులు యువతకు చేయందించాల్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పురుషోత్తం, కె.సురేష్, శంకరయ్య, రత్నప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్యకారుడికి జాక్‌పాట్


హార్బర్‌లో వలకు చిక్కిన నల్ల చందువాలు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శనివారం సందడి నెలకొంది. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఊహించని సంఖ్యలో నల్ల చందువాలు చిక్కాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్, అధిక ధర పలికే ఈ చేపలు ఒకేసారి పెద్ద మొత్తంలో లభించడంతో మత్స్యకారుడు మూగి రాముడు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఇన్ని చేపలు ఒకేసారి లభించలేదని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఈ చేపలకు విశేషమైన గిరాకీ ఉండటంతో, స్థానిక వ్యాపారులు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల మెరుపులు

శ్రీకృష్ణాపురం గురుకులం 86.4 శాతం ఉత్తీర్ణత


విశాల్ రాజ్, గురుకులం టాపర్

ఆరిలోవ: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు విశేష ప్రతిభ చూపారు. శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో 86.4 శాతం ఉత్తీర్ణత లభించింది. ఈ ఏడాది ఇక్కడ 37 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా.. 32 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ విద్యార్థి డి.విశాల్‌రాజ్ 957/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఎంపీసీలో టి.రాజేష్ 945/1000 మార్కులు సాధించాడు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు 41 మంది రాయగా.. 30 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిని గురుకులం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బీవీకే కాలేజీ: 88.4 శాతం

విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కళాశాలలో 2024–25లో ఒకేషనల్ కోర్సులు ప్రారంభించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో 26 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 23 మంది ఉత్తీర్ణులయ్యారు. 88.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బర్ల సంధ్యారాణి 459/500 మార్కులు సాధించినట్లు చెప్పారు.

శ్రీరామానుజ కాలేజీ: వంద శాతం

బీచ్‌రోడ్డు: ఇంటర్ ఫలితాల్లో పెదవాల్తేరు శ్రీరామానుజ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శివరామ దత్తాత్రేయ్ తెలిపారు. వారిలో 32 శాతం మందికి 90 శాతానికి పైగా మార్కులు వచ్చాయన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం చైతన్యనగర్‌లోని నారాయణ రెసిడెన్సీలో వివాహిత అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళానికి చెందిన ధర్మాన భాస్కర్‌రావుకు ముగ్గురు కూమార్తెలు. చిన్న కూతురు కల్పనాకుమారిని 2022లో నగరానికి చెందిన సిమ్మా రాంబాబు అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. ఆ సమయంలో రూ.7 లక్షల నగదుతో పాటు 15 తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చాడు. పెళ్లి జరిగిన కొద్ది కాలానికే అదనపు కట్నం కోసం రాంబాబుతోపాటు అతడి కుటుంబ సభ్యులు కల్పనాకుమారిని వేధించడం ప్రారంభించారు. ఈ విషయంలో అనేక సార్లు పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ కూడా జరిగినా మార్పు రాలేదు. ఈ నెల 11వ తేదీ రాత్రి కల్పనాకుమారి ఇంట్లో ఉరివేసుకొని చనిపోయిందంటూ భర్త రాంబాబు భాస్కర్‌రావు పెద్ద కుమార్తెకు సమాచారమిచ్చాడు. వెంటనే ఆమె తండ్రి భాస్కర్‌రావుకు విషయం తెలియజేయంతో తక్షణమే ఆయన శ్రీకాకుళం నుంచి వచ్చి పరిశీలించగా.. కల్పనాకుమారి మృతి అనుమానాస్పదంగా అనిపించింది. ఎంవీపీ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు చిన పోలమాంబ ఆలయ సమీపంలో అంజూరి కనకరాజు అనే వ్యక్తిపై కార్తీక్‌రెడ్డి అనే వ్యక్తి ఇనుప రాడ్‌తో దాడి చేసిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కనకరాజు లైటింగ్, ఫ్లెక్సీ ఫిక్సింగ్ వర్క్స్ చేసుకుంటూ ఉంటాడు. నాలుగేళ్ల కిందట కనకరాజు, కార్తీక్ రెడ్డి స్నేహితులుగా ఉండేవారు. కార్తీక్ చెల్లితో కనకరాజు చనువుగా ఉండటంతో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ రాత్రి కార్తీక్ రెడ్డి చిన పోలమాంబ గుడి సమీపంలో ఫ్లెక్సీ బిగిస్తున్న కనకరాజును రాడ్‌తో వెనుక నుంచి బలంగా కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోగా.. పక్కనే ఉన్న వారు ఆస్పత్రిలో చేర్చారు. కనకరాజు తలపై ఎనిమిది కుట్లు పడ్డాయి. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు.

ఈస్టర్ పండగకు వాల్తేర్ సెమెట్రీ సిద్ధం

మహారాణిపేట: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈస్టర్ పండగను ఈ నెల 20వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్తేర్ సెమెట్రీ అధ్యక్షుడు జార్జి చీడి తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సిమెట్రీలోని 30 నుంచి 40 టన్నుల వరకు ఉన్న వ్యర్థాలను లారీల ద్వారా బయటకు తరలించినట్లు చెప్పారు. క్రైస్తవులు వారి ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించుకోవడానికి , సమాధులను అలంకరించడానికి వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 20వ తేదీ ఉదయం 5 గంటల నుంచి బీజెడ్ లూథరన్ చర్చి క్వాయిర్ క్రైస్తవ భక్తి గీతాలను ఆలపిస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో సెమెట్రీ కార్యదర్శి జి.మాధ్యూ పీటర్, కోశాధికారి జార్జ్ పులెట్ తదితరులు పాల్గొన్నారు.

భానోదయం.. స్వర్ణమయం



కవులు పౌర్ణమి చంద్రుడిని వర్ణిస్తూ అనేక కవితలు, పద్యాలు రచిస్తారు. పౌర్ణమి నాడు ఉదయం భానుడిని వీరు వీక్షిస్తే అదే విధమైన కవితలు, పద్యాలు రచించడం తథ్యం. ఉదయాన్నే సాగర తీరంలో బంగారు వర్ణంతో దర్శనమిచ్చే భానుడి లేలేత కిరణాల స్పర్శను తనివితీరా అనుభవించాల్సిందే. కొబ్బరి చెట్ల ఆకుల మధ్య నుంచి భానోదయాన్ని వీక్షిస్తుంటే ఆ అనుభూతిని వర్ణించలేం. కాళ్లకు చల్లటి సముద్రపు నీరు తాకుతుంటే తీరంలో కూర్చుని ఈ సుందర దృశ్యాన్ని వీక్షించాల్సిందే. ఆస్వాదించే హృదయం ఉండాలే కాని ప్రతి నిత్యం విశాఖ సాగర తీరంలో ఇటువంటి సుందర.. స్వర్ణమయ భానోదయ దృశ్యం మనకు దర్శనమిస్తుంది.
- ఏయూక్యాంపస్